## 100 రోజులపాలనపై అధిష్ఠానంతో చర్చలు

- సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకతో రేవంత్ భేటీ
- నేడు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం
- సీఎం ఢిల్లీకి వెళ్లడం 11వ సారి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో వేర్వేరుగా సమావేశమయ్యారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక, పార్టీలో చేరికలు, రాష్ట్రంలో వంద రోజుల పాలన తదితర అంశాలపై వారితో చర్చించినట్టు సమాచారం. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుకు తీసుకున్న చర్యలను వివరించినట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్, నల్లగొండ, జహీరాబాద్, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 13 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటికి గతంలో ప్రతిపాదించిన పేర్ల స్థానంలో తాజాగా జరిగిన చేరికల కారణంగా కొన్ని చోట్ల అభ్యర్థులను మార్చాల్సిన అవశ్యకతపై సీఎం పార్టీ పెద్దలతో చర్చించినట్టు తెలిసింది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని వారికి వివరించడంతోపాటు త్వరలో మరికొందరు పార్టీలో చేరనున్నారని చెప్పినట్టు తెలిసింది. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని బరిలోకి దించి, గతంలో ప్రతిపాదించిన సునీతా మ హేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి పోటీ చేయించాలని ప్రతిపాదించినట్టు చెప్తున్నారు. సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌ను బరిలోకి దించపడమా? లేక ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమా? అనే అంశంపై చర్చించనున్నారని సమాచారం. ఎంపీ అభ్యర్థుల ఖరారుకు ఢిల్లీలో సోమవారం జరగాల్సిన కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంగళవారానికి వాయిదా పడటం, సీడబ్ల్యూసీ సమావేశం కూడా అదే రోజు ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి అక్కడే ఉంటారని తెలిసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టాక రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది 11వ సారి.


### సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్

సర్దార్ పటేల్ రోడ్డు, కోర్ట్ కాంపౌండ్, సికింద్రాబాద్-500003
టెలిఫోన్ నం: 040-27808600, ఫ్యాక్స్ నం. 040-27808606

**సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో లీజు సైట్ల యొక్క హౌస్‌హోల్డ్ లీజుదారులు/నివాసులకు నోటీసులు**

1. ఇంగ్లీష్‌లో స్థానిక వార్తా దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా మరియు తెలుగులో నమస్తే తెలంగాణలో వచ్చిన Lr.No. SCB/EB/Leases/89, తేది: 16-01-2023 క్రింద రిఫరెన్స్ పబ్లిక్ నోటీసు.
2. కంటోన్మెంట్ కోడ్ 1899 & 1912, కంటోన్మెంట్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్ (CLAR) 1925 & 1937 క్రింద మంజూరైన డిఫెన్స్ ల్యాండ్ యొక్క లీజుదారులు/మాజీ లీజుదారుల సమాచారం కొరకు తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖచే (i) ముగిసిన/ముగుస్తున్న 1899 & 1912 యొక్క కంటోన్మెంట్ కోడ్ లీజులు మరియు CLAR 1925 & 1937 క్రింద లీజులు పొడిగింపు (ii) పైన తెలిపిన పబ్లిక్ నోటీసు ప్రకారం, పూర్తికాలం ముగిసిన వారి యొక్క కంటోన్మెంట్ కోడ్ & CLAR లీజుల రెన్యువల్‌కు సంబంధించిన MoD లెటర్ నం. 11013/2/2016 (ల్యాండ్స్) తేది: 10-03-2017 ప్రకారం జారీ చేయబడిన ఒక మధ్యకాలిక పాలసీ రూపొందించబడింది. ఈ సూచనలు లీజు కాలం పూర్తిగా ముగిసిన లేదా 31-12-2023కు ముందు ముగిసిన వారి యొక్క లీజులకు మరియు మొదటి లేదా రెండవ పర్యాయాలు ముగిసినా కాని కొన్ని నియమ నిబంధనలకు లోబడి, లీజు యొక్క కొన్ని నిబంధనల ఉల్లంఘన కారణంగా రెన్యువల్ కొరకు అనుమతి ఇవ్వని వారియొక్క లీజు రెన్యువల్‌కు సంబంధించినవి. తదుపరిగా తెలియజేయునది ఏమనగా లీజుల పూర్తికాలం ముగిసిన లేదా 31-12-2023న లేదా ఆలోగా ముగియనున్న వారివి, మధ్యకాలిక పాలసీ మార్గ దర్శకాల నియమ నిబంధనలకు లోబడి 31-12-2024 వరకు రెన్యువల్ చేయబడతాయి.
3. సదరు మధ్యకాలిక పాలసీ ప్రస్తుతం 31-12-2024 వరకు లేదా సమగ్ర లీజు పాలసీని ఖరారు చేసే వరకు, ఏది ముందు అయితే దాని ప్రకారం ఒక సంవత్సరం తదుపరి కాల వ్యవధి వరకు పొడిగించబడింది. అటువంటి ఆస్తుల యొక్క లీజుదారులు/నివాసులు లీజు అద్దెలను చెల్లించడానికి అంగీకారంతోపాటు లీజు రెన్యువల్ కోసం సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా ఆన్‌లైన్ దరఖాస్తులను దాఖలు చేయవల్సిందిగా మరియు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ యొక్క ఇ-చవానీ మాడ్యూల్ ద్వారా లీజు రెన్యువల్ కొరకు వర్తించే ఏవైనా, ఉల్లంఘనల మాఫీ కొరకు అవసరమైన పత్రాలను దాఖలు చేయవల్సిందిగా కూడా ఇందుమూలంగా కోరబడుతున్నారు. వివరాలు **secunderabad.contt.gov.in** వద్ద కంటోన్మెంట్ బోర్డ్ సికింద్రాబాద్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడినవి మరియు నోటీసు బోర్డ్‌లో కూడా ప్రదర్శించబడినవి.
4. ఈ నిబంధనలకు కట్టుబడి ఉండని మరియు లీజుకు తీసుకున్న ఆస్తిని పొడిగించిన సమయంలోగా రెన్యువల్ దరఖాస్తు చేయడంలో విఫలమైన లీజుదారులు/నివాసులు, వారిపై మరియు ఎటువంటి జీవనాధార లీజు హక్కులు లేని వారిపై తొలగింపు చర్యలు చేపట్టబడతాయి.
5. డిఫెన్స్ ల్యాండ్ యొక్క లీజు సైట్ల లీజుదారులు/నివాసులు దీనిని గమనించి పాటించ గలరు.

No. SCB/EB/Leases/588
తేది: 18-03-2024

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్


# ఢిల్లీకి ముడుపులిచ్చే పనిలో రేవంత్ బిజీ

## కర్ణాటక నుంచి పది టీఎంసీల నీళ్లు తెచ్చే సోయి సీఎం, మంత్రులకు లేకపాయె: జగదీశ్‌రెడ్డి

- వ్యాపారులు, కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాదించే పనిలో జిల్లా మంత్రి
- వందరోజుల కాంగ్రెస్ పాలనలో ఏమీ ఒరగలే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం
- అన్నెపర్తిలో ఎండిన పంట పొలాల పరిశీలన



నల్లగొండ మండలం అన్నెపర్తిలో జగదీశ్‌రెడ్డికి ఎండిన పంట గురించి వివరిస్తున్న రైతు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ రూరల్, మార్చి 18: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఢిల్లీకి ముడుపులిచ్చే తపన తప్ప కర్ణాటక రాష్ట్రం నుంచి కనీసం 10 టీఎంసీల నీళ్లు తేవాలన్న సోయి లేదని రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రాష్ట్రం నుంచి 10 టీఎంసీల నీటిని తెచ్చుకుంటే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది కాదని చెప్పారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో సోమవారం ఆయన ఎండిపోయిన పంట పొలాలు, నిమ్మ తోటలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ట్యాంకర్లతో పొలానికి నీరు పెడుతున్న రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మంత్రికి వసూళ్ల మీద సోయి తప్ప రైతుల సమస్యల మీద లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యాపారులు, కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాదించే పనిలో ఉన్నారు తప్ప వంద రోజుల పరిపాలనలో ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు.

**ఇద్దరు మంత్రులవి ప్రగల్భాలే**

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రగల్భాలు పలుకడం తప్ప దేనికి పనికిరారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట, కోదాడతోపాటు అన్ని నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో కూడా ఎగువన నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్ నుంచి నీటిని తెప్పించి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలు ఎండిపోవడంతో పెట్టుబడి పోయి రైతులు విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరువుపై సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం అవుతుందని మండిపడ్డారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, బీఆర్‌ఎస్ నల్లగొండ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు బకరం వెంకన్న, తుమ్మల లింగ స్వామి, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు ఉన్నారు.

### మా బతుకులు ఆగమైనయ్: మహిళా రైతు చంద్రమ్మ

పంట పొలాల పరిశీలనలో భాగంగా మహిళా రైతు చంద్రమ్మతో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ఎంత నాటు పెట్టావు.. ఎంత ఎండిపోయింది అని అడిగారు. చంద్రమ్మ విలపిస్తూ 'మా బతుకులు ఆగం అయినాయి సార్. మమ్మల్ని ఆదుకోవాలి. ఐదు ఎకరాలు ఉంటే బోర్లు సక్కగా పోస్తాయో, పోయవో అని రెండెకరాలు నాటు పెట్టిన. మూడు బోర్లు పూర్తిగా ఎండిపోయినయ్. మళ్ల మూడు బోర్లు వేసినా సుక్క నీరు రాలే. ఉన్న రెండెకరాలు ఎండిపోతుంటే పాణం తల్లడిల్లింది. పంట చేతి కొచ్చే సమయం కాబట్టి రోజూ ట్యాంకర్లు పెట్టి నీరు పోస్తున్నాం. రెండు ఎకరాలకు ఇప్పటికే రెండు లక్షల పెట్టుబడి అయ్యింది. పంటలతోపాటు గొడ్లకు కూడా నీళ్లు కరువైనయి. కరెంట్ సక్కగా రాక, కాల్వల్లో నీరు లేక, బోర్ల నీళ్లు లేక నానా అవస్థలు పడి ఆగమైపోతున్నాం. మమ్మల్ని ఆదుకోవాలె. నాకు ఇప్పటివరకు రైతుబంధు సాయం కూడా అందలేదు' అని గోడును వెల్లబోసుకుంది.

### ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో 1.60 లక్షల నష్టం

- పురుగుల మందుతాగి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

శాయంపేట, మార్చి 18: ఇంటర్ విద్యార్థి నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. తండ్రికి చెప్తే తిడతాడన్న భయంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలం రాజుపల్లిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది.











